క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎస్‌ఈగా చంద్రశేఖరరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పంచాయతీ రాజ్ ఎస్‌ఈగా పీఆర్‌ఐ ఈఈ చంద్రశేఖరరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌ఈ శంకరనారాయణ గురువారం ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

గ్యారేజీలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి


ప్రతిజ్ఞ చేస్తున్న గ్యారేజీలోని కార్మికులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఆర్టీసీ–2డిపో గ్యారేజీలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ అల్తాఫ్ మాట్లాడుతూ, పటేల్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనలో నిందితున్ని శుక్రవారం పోలీసుల అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. చిత్తూరు ఆర్టీసీ టు డిపోలో సతీష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం బస్సు తీసుకుని పరదరామికి వెళుతుండగా ఇరువారం కూడలి వద్ద సతీష్ (30) అనే వ్యక్తి బస్సుకు అడ్డంగా వచ్చాడు. ఎందుకని ప్రశ్నించడంతో డ్రైవర్‌పై దాడి చేయగా గాయాలయ్యాయి . బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపట్టగా రిమాండ్‌కు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించారు.

ఇంటివద్దకే మెరుగైన వైద్యం


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని నంగమంగళంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. బీపీ, చక్కెరవ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 52 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది అనూష, పవిత్ర, శ్రీలత, సరిత, రూబి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో బ్రేక్

తవణంపల్లె: మండలంలో 8,778 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో 9,688 మందికి మంజూరు చేసినట్లు వివరించారు. శుక్రవారం మండలంలో 8,778 మంది పింఛను లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఉదయం 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.20 గంటల వరకు సర్వర్ పని చేయకపోవడంతో పింఛన్ల పంపిణీకి ఆటంకం కలగడంతో అంతరాయం కలిగింది. 12.30 గంటల నుంచి పింఛన్లు పంపిణీ కార్యక్రమం మళ్లీ మొదలైంది.

ప్రాణం తీసిన చైన్ స్నాచింగ్


ప్రమీల (ఫైల్)

చిత్తూరు అర్బన్/పూతలపట్టు: వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ పోలీసులకు సవాళ్లు విసురుతున్న ఒక ముఠా నిండు ప్రాణాన్ని బలిగొంది. మెడలో ఉన్న బంగారు చైనును లాక్కొనే క్రమంలో కిందపడి గాయపడిన ప్రమీల (60) శుక్రవారం మృతి చెందింది. గత నెల 26న ఇద్దరు దుండగులు మొహాలకు మాస్కు పెట్టుకుని పూతలపట్టు–పీలేరు జాతీయ రహదారిపై బైక్‌పై వస్తున్నారు. పేటమిట్టకు ఎలా వెళ్లాలి అని బైక్‌పై వెళుతున్న ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ప్రమీల, ఆమె కుమార్తె మల్లికను అడిగారు. కదులుతున్న వాహనం నుంచే ఇటువైపు వెళ్లండి అని చెబుతున్న ప్రమీల మెడలో ఉన్న బంగారు గొలుసును లాగారు. ఆమె కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. ఆమెను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కోమాలో ఉన్న ఆమెను తమిళనాడులోని రాణిపేటలో ఉన్న మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించిందని అక్కడి వైద్యులు చెప్పడంతో మల్లికను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమె శుక్రవారం మృతిచెందింది. దుండగులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీమాకు ఎగనామం

ఎన్నికల ముందు కూటమి నాయకులు రైతులకు అండగా ఉంటామంటూ హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి రాగానే కూటమి సర్కార్ మొండి చెయ్యి చూపుతోంది. ఉచిత పంటల బీమాకు మంగళం పలికింది. గత ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించి రైతులకు ఇబ్బందిలేకుండా చూసింది. అయితే ఈ ప్రభుత్వం రాగానే పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలంటూ నిబంధన పెట్టింది. ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ పథకం అమలుపై స్పష్టత లేదు. రబీ సీజన్‌లో రైతులకు ఆర్థికసాయం అందించకుండా వివక్ష చూపుతోంది.


వర్షానికి నేలమట్టమైన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

- ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం
- రైతులకు అండగా నిలిచిన గత ప్రభుత్వం
- ప్రీమియం చెల్లిస్తేనే బీమా లబ్ధి
- రైతులే ప్రీమియం చెల్లించుకోవాలని మెలిక

తవణంపల్లె: ఎన్నికల ముందు మాది రైతు ప్రభుత్వమని డప్పు వాయించుకున్న కూటమి నాయకులు అధికారంలోకి రాగానే రైతులకు మొండి చెయ్యి చూపారు. రైతులపై చిన్నచూపు చూపడంతోపాటు ఉచిత పంటల బీమాకు మంగళం పాడేశారు. దీంతో రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసింది. రైతులు సంతోషంగా పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం కూడా అందుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకానికి చేతులెత్తేసింది. రైతులే బీమా ప్రీమియం చెల్లించాలన్న నిబంధన పెట్టింది. బీమా చెల్లించిన వారే లబ్ధి పొందుతారని స్పష్టం చేసింది. కూటమి ప్రభుత్వంలో అప్పులు తప్ప ఆదాయం రావడంలేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు 9 గంటల ఉచిత కరెంటు అంటూ విపరీతంగా కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ఊసెత్తకపోవడం శోచనీయం.

బీమా ఉంటేనే పరిహారం

తుఫాను, భారీ వర్షాలు, వరదల వల్ల పంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వం పరిశీలించి పరిహారం అందుకోవడానికి పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతోంది. పంట విలువ అంచనా వేసి బీమా కంపెనీలు రైతులకు నష్టపరిహారం అందిస్తోంది. రైతులు పంటలపై బ్యాంకు రుణాలు తీసుకుంటే బ్యాంకు అధికారులే బీమా ప్రీమియం చెల్లిస్తారు. పంటల బీమా సకాలంలో చెల్లించని రైతులు విపత్తు సమయంలో పంటలు నష్టపోయినా నష్ట పరిహారం అందక నష్టపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

రైతులపై బీమా ప్రీమియం భారం పడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ క్రాప్ చేసుకున్న రైతులందరికీ ప్రీమియం మొత్తాన్ని చెల్లించి ఆదుకొంది. దీని వల్ల రైతులకు బీమా ప్రీమియం చెల్లించే పని లేకుండా పోయింది. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులతోపాటు కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ప్రభుత్వంలో పంట నష్టపోయిన 4,798 రైతులకు సకాలంలో రూ.81 కోట్లు వారి ఖాతాలకు పరిహారం చెల్లించి ఆదుకొంది.

డిసెంబర్ 31 లోపు ప్రీమియం చెల్లించాలి

రబీ సీజన్‌లో జిల్లాలో పంటల బీమా పథకం కింద ప్రీమియం చెల్లించడానికి వరి, వేరుశనగ, టమాటా పంటలను ఎంపిక చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ యోజన(పీఎంఎఫ్‌బీవై) పథకం కింద వరి, వేరుశనగ పంటకు టీజీఐసీ కంపెనీకి, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద టమాటా పంటకు బీమా ప్రీమియం వసూలు చేసుకోవడానికి ఇఫ్‌కో టోకియా వారిని నియమించారు. రైతులు బీమా కంపెనీలను సంప్రదించి డిసెంటర్ నెల 31వ తేదీ లోపల ప్రీమియం చెల్లించాలి

ఇప్పుడు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం

పంట	ఎకరాకు బీమా ప్రీమియం	హెక్టారుకు బీమా ప్రీమియం
వరి	రూ.84	రూ. 210
వేరుశనగ	రూ.60	రూ.150
టమాటా	1250	రూ. 3125

గత ప్రభుత్వం చెల్లించిన పంట బీమా ప్రీమియం

	రైతుల సంఖ్య	చెల్లించిన మొత్తం
2020	454 మంది	రూ.18 లక్షలు
2021	508 మంది	రూ.18 లక్షలు
2022	3,834 మంది	రూ.45 లక్షలు
మొత్తం	4,798 మంది	రూ. 81 లక్షలు


పొన్నేడుపల్లె దగ్గర నేలకొరిగిన వరి పంట (ఫైల్)

పంట బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



రైతులకు పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలి. రబీ సీజన్‌లో పంటల బీమాకు కొత్త విధానంలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీకి ఇచ్చారు. దీని వల్ల రైతులకు భారం తప్ప లాభం లేదు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలనే పంటల బీమా భాగస్వాములుగా చేయాలి.

– రవీంద్రరెడ్డి, ఎగువ తవణంపల్లె

ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం..



రైతులు పంటల బీమా చెల్లిస్తేనే నష్టపరిహారం అందుతుంది. ప్రభుత్వ విధివిధానాలు అందిన వెంటనే రైతులకు అవగాహన కల్పిస్తాం.

– జి.ప్రవీణ్, ఏఓ, తవణంపల్లె

ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం


వృద్ధులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులకు ఆస్పత్రిలోనే సుఖ ప్రసవం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గర్భిణులకు పీహెచ్‌సీలో కాన్పులు చేస్తున్నట్లు వివరించారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పకుండా భుజించాలని సూచించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు వాడాలన్నారు. వృద్ధాప్యంలో ఆరోగ్యంగా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, డీఈఓ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

మత్యంలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని మత్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని, వేపాకు పొగ వేయాలని సూచించారు. దోమలను లార్వా దశలోనే నాశనం చేయించాలన్నారు. గర్భవతులు 104, 108 వాహన సేవలను, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు డీఈఓ పాల్గొన్నారు.

పోలీసు సంస్మరణ ర్యాలీ..!


క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరులో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఎస్పీ మణికంఠ చందోలు క్యాండిల్ ర్యాలీ ప్రారంభించారు. శాంతి భద్రతలను కాపాడుతూ విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసుల సేవలు మరువలేనివని ఎస్పీ అన్నారు. వారిని స్మరిస్తూ గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను సైతం భాగస్వామ్యం చేశామన్నారు. పోలీసు విధులకు ఎలాంటి కళంకం తీసుకురాకుండా సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. మేళ తాళాల మధ్య పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు


చిత్తూరు శంకరయ్యగుంట వద్ద పింఛన్ల కోసం చెట్ల కింద నిరీక్షిస్తున్న వృద్ధులు

చిత్తూరు అర్బన్: ఆరు నెలల ముందు వరకు ఒకటో తేదీ వస్తోందంటే వృద్ధుల ముఖాల్లో సంతోషం వెలిగిపోయేది. ఉదయం 6 గంటలకే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించే పరిస్థితి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారింది. వృద్ధులకు పింఛను నగదు చేతికొచ్చే వరకు ఆందోళన తగ్గడం లేదు. చంద్రబాబు కుటిల బుద్ధిని మరోసారి చాటుకున్నారు. వలంటీర్ల వ్యవస్థను పూర్తిగా పక్కన పెట్టేసింది. సచివాలయ కార్యదర్శులకు పింఛన్ల బాధ్యత అప్పగించింది. చిత్తూరు నగరంలో శుక్రవారం చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ గందరగోళంగా తయారైంది. మూడు నెలల క్రితం వరకు పింఛన్ల పంపిణీలో జిల్లాలోనే టాప్–3 స్థానాల్లో నిలుస్తూ వచ్చిన చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఈ నెల 22వ స్థానానికి పడిపోయింది. మధ్యాహ్నం వరకు 63 శాతం ఉన్న పింఛన్ల పంపిణీ సాయంత్రానికి 92 శాతానికి చేరుకుంది. అయినా కూడా 16,348 మంది లబ్ధిదారులుంటే 15,066 మందికి తొలి రోజున పింఛన్లు పంపిణీ చేశారు. 1,282 మందికి పింఛన్లు అందలేదు. ఉదయం 8 గంటలవుతున్నా లబ్ధిదారులకు పింఛన్ అందకపోవడంతో సచివాలయాలకు క్యూ కట్టారు. దివ్యాంగులు పడుతే, లేస్తూ సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సాంకేతిక సమస్య అధిగమించిన తరువాత కూడా కొంత మంది కార్యదర్శులు, లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లకుండా సచివాలయాల వద్దే పింఛన్లను పంపిణీ చేశారు. మొత్తంమీద ఈ నెల జరిగిన పింఛన్ల పంపిణీలో అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. వచ్చేనెల కూడా ఇంటింటికీ తిరిగి ఇవ్వలేమని, అందరూ వచ్చి ఓ చోట నిరీక్షిస్తేనే అక్కడకు వచ్చి పింఛన్లను పంపిణీ చేస్తామని కార్యదర్శులు కాలనీల్లో లబ్ధిదారులకు తెగేసి చెప్పారు. దీన్ని బట్టి చూస్తే మరి కొన్ని నెలల్లో పింఛన్లకు కూటమి ప్రభుత్వం కోత విధించేలా ఉంది. గత ప్రభుత్వం 5 రోజులపాటు పింఛన్లు పింపిణీ చేస్తే, ఈ ప్రభుత్వం మాత్రం కేవలం ఒకటిన్నర రోజుకే పరిమితం చేసింది. రాబోయే రోజుల్లో కేవలం ఒక్క రోజు మాత్రమే పింఛను ఇచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది.





బస్సుల్లేక ప్రయాణికులకు ఇక్కట్లు

పండుగ సాకు చూపి ఆర్టీసీ పలు బస్సులను డిపోకే పరిమితం చేసింది. పల్లె బస్సులతోపాటు మరిన్ని బస్సులను నిలుపుదల చేయించింది. పండుగలో కలెక్షన్ ఉండదని భావించి ఆపేసింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురికావాల్సి వచ్చింది. పుత్తూరు, పెనుమూరు, పరదరామి, ఇతరత్రా మార్గాల్లో గురువారం బస్సులకు బ్రేకులు వేసింది. దీంతో చిత్తూరు నుంచి అటు వైపు వెళ్లే ప్రయాణికులు గమ్యం చేరుకోవడానికి నానా తిప్పలు పడ్డారు. శుక్రవారం కూడా తిరుపతి, బెంగుళూరు వెళ్లే ప్రయాణికులకు ఇదే పరిస్థితి ఎదురైంది. అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోయారు.

–చిత్తూరు రూరల్ (కాణిపాకం)

పేదల పక్షపాతి ఏఐటీయూసీ


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: పేదల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ 105 ఏళ్లుగా పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ జిల్లా గౌరవఅధ్యక్షుడు నాగరాజన్ తెలిపారు. నగరంలోని గాంధీవిగ్రహం వద్ద ఘనంగా ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తే కార్మిక వర్గం సహించదన్నారు. ఎర్రజెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చరిత్రను పుట్టుకను, పోరాటాన్ని, గొప్పతనాన్ని కార్యకర్తలకు నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణి, గోపినాథ్, దాసరి చంద్ర, ఆర్ముగంరెడ్డి, రమాదేవి, విజయ్‌కుమార్, రఘు, జలంధర్, గజేంద్రబాబు, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గంటామోహన్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుబ్రమణి, రజినికుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, జయశంకర్, చిరంజీవి, ఈశ్వర్, వినోద్, సుగుణ, రమణి, మెడికల్ యూనియన్, ఐఎంఎఫ్ఎల్, భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ నాయకులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కేదార గౌరీ వ్రతం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో దీపావళి పండుగను ఇంటింటా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిత్తూరువాసులు తెల్లవారుజామున తలారా స్నానమాచరించి చేసి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయలు, ఇళ్లలో నోములు ఆచరించి, నైవేద్యంగా సమర్పించారు. అనంతరం టపాసులు కాల్చుతూ సందడి చేశారు. పల్లెనుంచి పట్టణాల వరకు దీప కాంతులతో వీధులన్నీ దేదీప్యమానంగా వెలిగాయి.

ఆలయాల్లో వ్రతం

చిత్తూరులోని దుర్గమ్మ ఆలయం, అగస్తీశ్వర స్వామి ఆలయం, పొన్నియమ్మ ఆలయాల్లో రెండు రోజులపాటు అమ్మవారు విశేష పూజలందుకున్నారు. అభిషేకం, విశేష పూజల అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో క్యూకట్టారు. భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి కేదార గౌరి వ్రతమాచరించారు. నోములు నోచుకుని అమ్మవారి తరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది.

నోముల పూజలు

తవణంపల్లె: మండలంలోని ప్రజలు దీపావళి పండుగను రెండు రోజులపాటు సంతోషంగా జరుపుకున్నారు. నరక చతుర్దశిని పురస్కరించుకుని పల్లెల్లో ప్రజలు టపాకాయలు కాల్చారు. శుక్రవారం ప్రజలు భక్తితో కేదార గౌరీ దేవీ వ్రతం నిర్వహించారు. గౌరీ దేవిని ప్రతిష్టించి భక్తిప్రపత్తులతో పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. అనంతరం నోములు నోచుకొని మొక్కులు చెల్లించారు.

దీపావళి సంబరాలు

ఐరాల: మండల వ్యాప్తంగా దీపావళిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం నరక చతుర్దశిని పురస్కరించుకుని ఉదయం యువత, పిల్లలు పెద్ద ఎత్తున గ్రామాల్లో బాణసంచా కాల్చి సందడి చేశారు. దీపావళి సందర్భంగా శుక్రవారం అన్ని ఆలయాల్లో కేదార గౌరీ వ్రతాన్ని భక్తిప్రపత్తులతో ఆచరించారు. స్థానిక గ్రామదేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారికి మహిళలు పూజ సామగ్రితో వెళ్లి సామూహికంగా వ్రత పూజలో పాల్గొన్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నోమువ్రతం ఆచరించి ముత్తైదువులకు నోముదారాలు ఇచ్చి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మూడు రోజుల వేడుకలు

బంగారుపాళెం: దీపావళి పండుగ పర్వదినాన్ని శుక్రవారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది దీపావళి పండుగను కొందరు 30న నరకచతుర్దశిని, 31 దీపావళి పండుగను నిర్వహించుకోగా మరికొందరు 31న నరకచతుర్దశి, నవంబరు 1న దీపావళి పండుగను నిర్వహించుకున్నారు. పిల్లలు, పెద్దలు టపాకాయలు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఇళ్లలో గౌరీదేవిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి నోములు నోచారు. మండలంలోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని పలువురు దుకాణదారులు తమ దుకాణాల వద్ద పూజలు చేశారు. వాహన పూజలు నిర్వహించారు.

ఘనంగా నరకచతుర్దశి

గుడిపాల: మండలంలో శుక్రవారం నరకచతుర్దశిని ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున లేచి తలంటి స్నానమాచరించి నూతన దుస్తులు ధరించారు. ఇంటి ముంగిట టపాకాయలు పేల్చారు. సాయంత్రం ఇంటిఎదుట మహిళలు తమ పిల్లలతో కలిసి చిచ్చుబుడ్లు వెలిగించి ఆనందంగా పండగ జరుపుకున్నారు. నరహరిపేట సమీపంలో గల భద్రకాళమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. లక్ష్మీదేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వారివారి ఇళ్లల్లో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.




తవణంపల్లె: వ్రతమాచరిస్తున్న భక్తులు, గుడిపాల: విశేషాలకంరణలో భద్రకాళి అమ్మవారు, బంగారుపాళెం: గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు




చిత్తూరు: దీపావళి సంబరం, చిత్తూరు: దుర్గమ్మ ఆలయంలో కేదార గౌరీవ్రత పూజలు చేస్తున్న భక్తులు, ఐరాల: వ్రత పూజలు నిర్వహిస్తున్న మహిళలు